సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024





## కానరాని నీటి జాడ

నదులు, చెరువుల నుంచి ఇసుక, మట్టి తరలించేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి, పంటలు ఎండిపోతున్నాయి. - 8లో



## అదుపులోకి రాని అతిసారం

తవణంపల్లె మండలం కొత్త గొల్లపల్లెలో అతిసారం అదుపులోకి రాలేదు. తాజాగా ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. - 8లో



## పోస్టుమార్టం.. డాక్టర్లకు భయం

జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ల కొరత కారణంగా మృతదేహాలు పోస్టుమార్టం చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు మహా లడ్డూ వేలం

కాణిపాకం: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం మహా లడ్డూ బహిరంగ వేలం ఉంటుందని ఈవో గురుప్రసాద్ తెలిపారు. 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని రాత్రి వేలం నిర్వహిస్తామన్నారు. వేలం అనంతరం తెప్పల మీద లడ్డూ ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

### నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక జిల్లా అధికారి మల్లికార్జున తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 6.30 గంటలకు గాంధీ విగ్రహం నుంచి మెసానికల్ మైదానం వరకు 2కే రన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా పర్యాటక ప్రదేశాల ఆవశ్యకతను తెలియజేసేందుకు విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు ఈ 2కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజలు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజులు

కల్లూరు(పులిచెర్ల): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఈఓ దేవరాజులు పేర్కొన్నారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇతరులు ఎవరైనా ఓటీపీ, సెల్ నెంబరు అడిగితే చెప్పకూడదన్నారు. చెబితే మోసం చేస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంఈఓ సిద్ధరామయ్య తదితరులు పాల్గొన్నారు.

### పరిశ్రమలపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్ : పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం పీఎంఈజీపీ (ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన పాల్గొన్న ఎంపీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ పథకంలో విరివిగా రుణాలు, సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చదువుకున్న యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని మరికొందరికి ఉపాధి కల్పించవచ్చన్నారు. డీఆర్‌డీఏ శాఖ అధికారులు పీఎంఈజీపీ ఉపయోగాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ వృత్తిలో ప్రావీణ్యం ఉన్న వారు ఒక క్లస్టర్‌గా ఏర్పడి వ్యాపారం మొదలు పెడితే మరింత ఫలితాలు వస్తాయన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర కమిషన్ డైరెక్టర్ గ్రీప్ మాట్లాడుతూ పీఎంఈజీపీలో వేలాది మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎల్‌డీఎం హరీష్ మాట్లాడుతూ ఔత్సాహికులు తమ వ్యాపార అవసరాలకు పొందే రుణం, వచ్చే ఆదాయాన్ని బేరీజు వేసుకుని ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, ఔత్సాహికులు పాల్గొన్నారు.

# నేడు తిరుమలకు వైఎస్ జగన్

- రేపు శ్రీవారిని దర్శించుకోనున్న వైఎస్సార్‌సీపీ అధినేత

సాక్షి ప్రతినిధి, తిరుపతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుమలకు విచ్చేయనున్నారు. ఆయన శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తిరుమల పవిత్రత, లడ్డూ ప్రసాదం విశిష్టతకు భంగం వాటిల్లేలా ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబుపై భక్తులు భగ్గుమంటున్నారు. బాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేయాలని మాజీ సీఎం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం సాయంత్రం తిరుమలకు చేరుకోనున్నారు. గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి, సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాత్రి 7 గంటలకు తిరుమల చేరుకుంటారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి శనివారం ఉదయం 10.30–11.30 గంటల మధ్య శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటారు. దర్శనానంతరం అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారని ఆయన పీఏ నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమ ప్రదాత, తమ అభిమాన నాయకుడు తిరుపతికి వస్తున్నారని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు.



# హాస్టళ్లలో అప్పుల వడ్డన

సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థుల ఆకలి తీర్చడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా బిల్లులు అందడం లేదు. ఫలితంగా వార్డెన్‌లపై అప్పుల భారం పెరుగుతోంది. వంటలో నాణ్యత కొరవడుతోంది. దీనికితోడు కూరగాయ ధరల పెరుగుదల భోజనంపై ప్రభావం చూపుతోంది. హాస్టళ్లలో వడ్డించే భోజనం విద్యార్థులకు మింగుడు పడడం లేదు. వసతి గృహాల్లో అందించే భోజనంపై తల్లిదండ్రుల్లో సైతం ఆందోళన వ్యక్తమవుతోంది. బిల్లులు మంజూరు చేయాలని వార్డెన్లు నెలల తరబడి వేడుకుంటున్నా కొత్త ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదు.






- వసతి గృహాలకు మంజూరు కాని బిల్లులు
- వార్డెన్‌లకు వడ్డింపు కష్టాలు
- మరోవైపు పెరిగిన ధరల ప్రభావం
- విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

పూతలపట్టు: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి 119 వసతి గృహాలు ఉన్నాయి. ఈ గృహాల్లో 8,719 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరికి ప్రభుత్వం ప్రత్యేకంగా మెనూ కేటాయించి ఆ ప్రకారం భోజనం వడ్డిస్తుంది. ఈ క్రమంలో సివిల్ సప్లయ్స్ నుంచి రేషన్ బియ్యం వసతి గృహాలకు సరఫరా అవుతుంది. ఇందుకుగాను ప్రభుత్వం సివిల్ సప్లయ్స్‌కు కిలోకు రూ.1 చొప్పున చెల్లిస్తుంది. నెలవారీగా కిరాణా సరుకులు కాంట్రాక్ట్ తీసుకున్న వారి నుంచి సరఫరా అవుతాయి. వారి నుంచి నెలకు సరిపడా 18 రకాల సరుకులు నేరుగా వసతి గృహాలకు చేరుతాయి. పాలు, గుడ్లు, కూరగాయలు, చికెన్, వంట గ్యాస్ తదితరాలను విద్యార్థుల మెనూ చార్జీల ద్వారా నడిపిస్తుంటారు. ఈ చార్జీలను ఆయా వసతి గృహాల వార్డెన్లు భరిస్తుంటారు. అయితే మెనూ బిల్లులు సకాలంలో అందక భోజన వడ్డింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బిల్లులు రాక వార్డెన్‌లపై అప్పుల భారం పడుతోంది.

**అప్పులు ఇలా...**

ఈ ఏడాది జనవరి వరకూ గత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఆ పెండింగ్ బిల్లులు వార్డెన్లకు అప్పులను తెచ్చిపెడుతున్నాయి. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నారు. అప్పులు కూడా తలకు మించిన భారం కావడంతో ఏం చేయాలో తెలియక తికమకపడిపోతున్నారు. ఆరు నెలలకు గాను రూ.2.50 లక్షలకుపైగా మెనూ చార్జీ బిల్లులు చెల్లించాల్సి ఉందని వసతి గృహాల వార్డెన్‌లు దిగాలుగా చెబుతున్నారు.

**కానరాని నిర్వహణ నిధులు**

వసతి గృహాల నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో విద్యుత్ బల్బులు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, చిన్నపాటి కిటికీలు, తలుపుల మరమ్మతులకు సొంత సొమ్మును వార్డెన్లు వెచ్చించాల్సి వస్తోంది. హాస్టల్ నిర్వహణకు ప్రతి నెలా కనీసం రూ.3 వేలు నుంచి రూ.5 వేల వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తున్నట్లు వార్డెన్లు చెబుతున్నారు. పెండింగులో ఉన్న బిల్లుల విషయమై జిల్లా ఉన్నతాధికారికి వార్డెన్లు తమ బాధను చెప్పినా, నిధులు రావాలని, ప్రభుత్వం ఇంకా బిల్లులు మంజూరు చేయలేదని చెబుతున్నారు. దీంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వార్డెన్లు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వసతి గృహాలకు సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

**సాంఘిక సంక్షేమ వసతి గృహాల వివరాలు**

| | |
|---|---|
| చిత్తూరు జిల్లాలో వసతి గృహాల సంఖ్య 57 | విద్యార్థుల సంఖ్య 3,419 |
| తిరుపతి జిల్లాలో వసతి గృహాల సంఖ్య 62 | విద్యార్థుల సంఖ్య 5,300 |
| మెనూ చార్జీల బిల్లుల బకాయిలు రూ. 2.50 లక్షలకు పైగా | |

**ఇతర వివరాలు**

| | |
|---|---|
| ప్రతి నెలా అవసరమయ్యే గ్యాస్ సిలిండర్లు 820 | |
| రోజుకు బియ్యం 4 వేల కిలోలు | కూరగాయలు 1,200 కిలోలు |
| చికెన్ (ఒక్కరోజుకు గాను) 830 కేజీలు (వారంలో మూడు రోజులు) | గుడ్లు (ఒక్కరోజుకు గాను) 8719 (ఆరు రోజులు) |
| పాలు 830 లీటర్లు (రోజూ) | |

**మెనూ చార్జీలు ఇలా..**

సాధారణ వసతి గృహంలో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకూ రూ.46, కళాశాల వసతి గృహాల్లో ఒక్కో విద్యార్థికి భోజన ఖర్చులకుగాను రూ.53 చెల్లిస్తుంది. ఈ కేటాయింపులతో నెలకు సాధారణ వసతి గృహంలో ఒక్కో విద్యార్థికి రూ.1,400, కళాశాల విద్యార్థికి రూ.1,600 చెల్లిస్తుంది. ఈ లెక్కన మెనూ ప్రకారం వారానికి ఆరు కోడి గుడ్లు, ప్రతి ఆదివారం బిరియాని, అరటి పండ్లు, పాలు, కూరగాయలతో కూడిన ఆహారం అందించాల్సి ఉంది. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం చోటు చేసుకోవడంతో విద్యార్థులకు సరైన భోజనం అందించడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కూరగాయల ధరల ప్రభావం**

గత కొన్ని రోజులుగా కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రధానంగా తెల్లగడ్డ కిలో ధర రూ.340 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. అల్లం రూ.170 ఉంది. ఉల్లి కిలో రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. టమాటా కిలో రూ.35 నుంచి రూ.50 వరకు అమ్ముడుపోతోంది. పచ్చి మిరప కిలో రూ.60కు విక్రయిస్తున్నారు. ఈ ధరల దెబ్బకు వసతి గృహాల విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందడంలేదు. ఇచ్చే మెనూ చార్జీలకు, పెరిగిన కూరగాయల ధరలకు పొంతన లేదని, ఇలాగైతే నిర్వహణ కష్టమని వార్డెన్‌లు వాపోతున్నారు.

**త్వరలో బిల్లులు మంజూరు అయ్యేలా చూస్తాం**

ఎస్సీ వసతి గృహాల నిర్వహణకు సంబంధించి ఆరు నెలల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరో వారం రోజుల్లో బిల్లులు మంజూరవుతాయని తెలిసింది. ఈ మేరకు విద్యార్థులకు భోజనం వడ్డింపులో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– రాజ్యలక్ష్మి, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ



వసతి గృహంలో విద్యార్థులు



పి.కొత్తకోట ఎస్సీ ప్రభుత్వ వసతి గృహం

# బాబు పాపాల ప్రక్షాళన కోసమే!



మాట్లాడుతున్న విజయానందరెడ్డి, నారాయణస్వామి

వెదురుకుప్పం/చిత్తూరు: కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడి పడి ఉన్న లడ్డూ ప్రసాదాల విశిష్టతను మంట గలిపేందుకు చంద్రబాబు చేస్తున్న అపకీర్తి, అపచారాలు, పాపాల నుంచి ప్రక్షాళన చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. తిరుమల ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే క్రమంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో శనివారం పూజలు చేయాలని వారు సూచించారు. వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే సీఎం చంద్రబాబు తిరుమల లడ్డూపై రాజకీయ వివాదం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. బాబు అసమర్థత, చేతగానితనం నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారన్నారు. లడ్డూ వదంతులపై సిట్‌తో కాకుండా సీబీఐ లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. అప్పుడే కోట్లాది మంది భక్తుల్లో ఉన్న అనుమానం తొలగిపోతుందన్నారు. అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హిందూ దేవాలయాల్లో పూజలు చేయాలన్నారు. రాజకీయ దుర్బుద్ధితో చంద్రబాబు చేస్తున్న పాపాలను కడిగిపారేయాలని కోరారు. ఇదో పవిత్ర కార్యక్రమంగా భావించి చిత్తశుద్ధితో చేయాలని పిలుపు నిచ్చారు. శనివారం ఉదయం 9.30 గంటలకు చిత్తూరు నగరంలోని కట్టమంచి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయనున్నట్లు విజయానందరెడ్డి తెలిపారు.

# పార్వతీ పుత్రుడికి పూలంగి సేవ!

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ప్రత్యేక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిపిస్తున్నారు. ప్రతిరోజు పలు రకాల వాహనాలపై స్వామివారు భక్తులకు అభయమిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పూలంగిసేవలో కనువిందు చేశారు. వేదపండితులు ఉదయం విఘ్నేశ్వరునికి అభిషేకం చేశారు. సుగంధ పుష్పాలు, గరిక మాలలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అలంకార మండపంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం కనుల పండువగా పూలంగి సేవ నిర్వహించారు. అనంతరం భక్తిప్రపత్తులతో ఊంజల్‌సేవను జరిపించారు. ప్రాకారోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పూలంగి సేవలో వరసిద్ధి వినాయక స్వామివారు

**నేడు తెప్పోత్సవం**

బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం, రాత్రి తెప్పోత్సవంతో బ్రహ్మోత్సవం ముగుస్తుందని ఆయన వివరించారు.

# మృత్యు ఘాట్

- తరచూ మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు
- గత 8 నెలల్లో 30 ప్రమాదాలు
- 17 మంది దుర్మరణం
- 100 మందికి పైగా గాయాలు

బంగారుపాళెం: చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. హైవే కావడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం వంటి కారణాలతో హైవేపై రోజూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని జాతీయ రహదారిపై గడచిన 8 నెలల్లో 30కి పైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అందులో 17 మంది మృతి చెందగా 150 మందికి పైగా గాయపడ్డారు.

**అక్కడే ఎక్కువ ప్రమాదాలు**

మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై మొగిలి ఘాట్, బలిజపల్లె, కాటప్పగారిపల్లె, కేజీ సత్రం, సంక్రాంతిపల్లె వద్ద గత మలుపు రోడ్ల వద్దే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులు అనేక కార్యక్రమాలను చేపట్టారు. డేంజర్ జోన్ల వద్ద ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని, రహదారి నిబంధనలు పాటించాలని అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు.

**ఈ నెలలోనే 12 మంది మృతి**

మండలంలో ఈ నెలలో జరిగిన ప్రమాదాల్లో 12 మంది మృతి చెందారు. ఈ నెల 13వ తేదీ మండలంలోని మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. 14వ తేదీ మండలంలోని కొత్తపల్లె బ్రిడ్జిపై కారు రక్షణ గోడను ఢీకొనగా ఇద్దరు మృతి చెందారు. 26న ఆగిఉన్న లారీని మరోలారీ ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఘాట్‌లో ప్రమాదాలు ప్రయాణికులను కలవరపెడుతున్నాయి.



మొగిలి ఘాట్‌లో బస్సును ఢీకొన్న కంటైనర్ (ఫైల్)



కొత్తపల్లె బ్రిడ్జిపై ప్రమాదంలో ధ్వంసమైన కారు (ఫైల్)

**నోటీసు జారీ చేసిన సుప్రీం కమిటీ**

మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై పూర్తి స్థాయిలో వివరాలను అందజేయాలని సుప్రీంకోర్టు రహదారి భద్రత కమిటీ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్‌కి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 13న శుక్రవారం ఆర్టీసీ బస్సును కంటైనరు ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందగా, 33 మంది గాయపడినట్లు కమిటీ నివేదిక ఇచ్చింది. డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం వంటి కారణాలతో చోటుచేసుకుంటున్న ఇటువంటి ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది. పూర్తి స్థాయి నివేదికను అక్టోబరు 20వ తేదీలోపు అందించాలని కోరింది.

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం
వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.




సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థకూడిక తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.

SAKSHI
99122 20586, 97054 44179
Mail id: tptadvtsakshi@gmail.com

# కానరాని నీటి జాడ



మూడేళ్ల కిందట సాగైన వరి పంట

**పలమనేరు పట్టణ సమీపంలోని పెద్ద చెరువులో ఎంత కరువొచ్చినా నీళ్లుంటాయి. గత పదేళ్ల నుంచి ఈ చెరువు ఇంతవరకు ఎండిపోలేదు. ఈ చెరువు కట్ట కింద ఏటా వరి పంట సాగవుతుండేది. చెరువు ఆయకట్టు ప్రాంతమంతా పచ్చగా కనిపిస్తూ కోనసీమను తలపించేది. ఈ చెరువు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఉండడంతో ఈ మార్గం ద్వారా వెళ్లే పలువురు కార్లను ఆపి ఈ పచ్చదనానికి పరవశించిపోయే వారు. పట్టణానికి చెందిన దాదాపు 400 మంది రైతులకు సంవత్సరానికి మూడు పంటలు ఇక్కడ పండేవి. ప్రతి సీజన్‌లోనూ చెరువు కట్టపై వరి ఒబ్బిళ్లు, వడ్లను ఎండబోయడం ఇవన్నీ కనిపించేవి. అయితే ఇదంతా మూడేళ్ల కిందటి మాట. ప్రస్తుతం కీలేరులో పంట సాగు లేకుండా పోయింది. కట్ట మొదట నుంచి ఆఖరు దాకా బీళ్లే దర్శనమిస్తున్నాయి. కొందరు రైతులు భూములను అమ్ముకోవడంతో కట్టకింద రియల్ వెంచర్లు వెలిశాయి.**



పలమనేరు ప్రాంతంలో ఎండిన బావులు

- అడుగంటిపోతున్న బోర్లు, బావులు
- కురవని వర్షాలు, ఎండిన చెరువులు
- వెయ్యి అడుగుల లోతులోనూ కనిపించని పాతా ళ గంగ
- చెరువులు, నదుల్లో యథేచ్ఛగా మట్టి, ఇసుక దందా
- ఎండుతున్న పంటలతో అయోమయంలో రైతన్నలు

**పలమనేరు:** అసలే నష్టాల్లో ఉన్న రైతన్నకు కష్టాలు వచ్చి పడుతూనే ఉన్నాయి. దెబ్బ మీదే దెబ్బ అన్నట్టు వర్షాల జాడ లేక భూగర్భజలాలు అడుగంటి పోయి బోర్లలో నీరు రావడం లేదు. అప్పో సప్పో చేసి బోరు వేసినా నీళ్లు పడతాయన్న గ్యారంటీ లేదు. మూడేళ్ల క్రితం సరాసరి బోర్ల లోతు 750 అడుగులు ఉండగా, ప్రస్తుతం వెయ్యి అడుగులు వేసినా గంగ జాడ కానరావడం లేదు. దీంతో ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతన్నలు పడుతున్న ఆపసోపాలు అన్నీ ఇన్నీ కావు. దీనికి తోడు చెరువులు, నదుల్లో ఇసుక తవ్వకాలు, మట్టి తోడేయడంతో భవిష్యత్తుల్లో పలమనేరు, కుప్పం డివిజన్లలో భూగర్భజలాలు అడుగంటే పరిస్థితి కనిపిస్తోంది.

**ఓ బోరుకు రూ.3 లక్షలు**

భూగర్భజలాలు అండుగంటడంతో 1000 అడుగుల బోరు, కేసింగ్ పైపు తదితరాలకు రూ.3 లక్షల దాకా రైతు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇంత ఖర్చు పెట్టినా నీరు రాకపోతే ఆ రైతు పరిస్థితి ఇక అంతే. రెండు మూడేళ్లపాటు చేసిన అప్పులు తీర్చలేక, పంటను సాగు చేయలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఒకవేళ బోర్లో నీళ్లు పడినా బోరుకు మోటరు, పైపులు తదితరాలు అమర్చేందుకు మరో రెండు లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఆ లెక్కన బోరు వేసి, మోటారు బిగించాలంటే రూ.5లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

**వర్షాలు లేక ఎండిన చెరువులు**

ఈ ప్రాంతంలో వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తుంటాయి. గత ఏడాదిగా సాధారణ వర్షం సైతం ఇక్కడ నమోదు కాలేదు. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి ఈ సమస్య ఏర్పడింది. దీనికి తోడు ఈ ప్రాంతంలో 800 చెరువులుండగా 650 చెరువుల్లో చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. మొన్న వినాయకుని విగ్రహాలను సైతం ఎండిన చెరువు గుంతల్లో వేయాల్సి వచ్చింది.

**చెరువులను చెరబట్టిన అక్రమార్కులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార పార్టీకి చెందిన అక్రమార్కులు చెరువుల్లో మట్టిని తరలించడం మొదలెట్టారు. ఇక ఇసుక అక్రమాలకు లెక్కేలేదు. దీంతో ఉన్న చెరువులను సర్వనాశనం చేసేశారు. భవిష్యత్తులో వర్షాలు పడినా చెరువుల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితి కనిపించడం లేదు. చెరువులే కాదు వాగులు, వంకలు, కౌండిన్య నది ఇలా దేన్నీ వదలకుండా ఇప్పటికే ఇసుకాసురులు ధ్వంసం చేసేశారు.

### నెల వ్యవధిలో నీరు తగ్గిన బోర్లు

జిల్లాలోని పడమటి ప్రాంతమైన పలమనేరు, కుప్పం డివిజన్లలో రైతులు పూర్తిగా బోరుబావుల పైనే వ్యవసాయాన్ని సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో 80 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. మరోవైపు నదులు, వాగులు, కాలువలు లేకపోవడంతో రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్లు వేసుకొని పంటలను సాగు చేసుకుంటున్నారు. రెండు డివిజన్ల పరిధిలో 80వేల వ్యవసాయ బోర్లున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి 20వేల బోర్లలో రెండు ఇంచీలొస్తున్న నీరు ఇప్పుడు ఇంచీకూడా రావడం లేదు. గత నెల రోజుల్లో రెండు వేల బోర్లు ఎండిపోయాయి. దీంతో ఉన్న పంటలు కంటి ముందే ఎండుతుంటే మనసొప్పని రైతన్నలు ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. కొందరు మాత్రం ప్రైవేటు వ్యాపారుల నుంచి అప్పుచేసి కొత్త బోర్లు లేదా పాత బోర్ల డీపెనింగ్ చేస్తున్నా నీటి జాడ లేకుండా పోతోంది.



పలమనేరు ప్రాంతంలో ఎండిపోయిన వ్యవసాయబోర్లు

### వెయ్యి అడుగులేసినా..



మా ప్రాంతంలో భూగర్భ జలాలు చాలా లోతుకెళ్లిపోయాయి. నాలుగేళ్లకు ముందు 200 నుంచి 300 అడుగుల్లో నీళ్ళు పడేది. ఇప్పుడు వెయ్యి అడుగులేసినా నీళ్లు పడతాయన్న గ్యారంటీ లేదు. ఒక బోరు ఫెయిల్ అయితే రైతు మళ్లీ కుదురుకోవడం అంత సులువు కాదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పంటలు సాగిచేసినట్టే. ముఖ్యంగా చెరువులను, నదులను నాశనం చేస్తున్నారయ్యా.

– పుష్పరాజ్, ఏటిగడ్డిండ్లు, పలమనేరు మండలం

### వర్షాలు పడినా నీరుండదు



నక్కపల్లి చెరువులో నీళ్లు ఉన్నప్పుడు కీలేరి (కట్టకింద భూములు) పూర్తిగా సాగయ్యేది. కొత్తగా బోరేసినా నీరు పడుతుందనే నమ్మకం లేదు. ఉన్న బోర్లలో కూడా గ్యాపులొస్తున్నాయి. బోర్లను లోతు చేయిద్దామంటే ఉన్న నీళ్ళు ఎక్కడ ఆగిపోతాయోమోననే భయం. వాన పడినా చెరువుల్లో నీరు నిలవాలంటే బంకమట్టి, ఇసుక ఉండాలి. కానీ వాటిని అక్రమార్కులు తోడేస్తుంటే నీళ్లు ఎలా నిలుస్తాయి.

– ఈశ్వరయ్య, నక్కపల్లి, పలమనేరు మండలం

## అదుపులోకి రాని అతిసారం



అతిసార బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

**తవణంపల్లె:** మండలంలోని కొత్త గొల్లపల్లెలో అతిసారం వ్యాధి ఇంకా అదుపులోకి రాలేదు. తాజాగా మరో ఐదుగురు అతిసారం బారిన పడ్డారు. సమాచారమందుకున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవితోపాటు మలేరియా అధికారులు గురువారం మరోసారి గ్రామాన్ని సందర్శించారు. అతిసారం ప్రబలకుండా గ్రామంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారులను డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. వైద్యాధికారులు గ్రామంలోనే వైద్య శిబిరం నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అతిసారంతో బాధపడుతున్న రోగుల ఆరోగ్యస్థితిగతులను తెలుసుకున్నారు. అతిసారం బాధితుల సంఖ్య పెరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. వైద్య సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి వైద్య ఎరీక్షలు చేయించి నివేదికలను అందజేయాలని సూచించారు. గ్రామంలో పైపులైన్ల లీకేజీ అరికట్టి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కుమార్, స్థానిక సర్పంచ్ సహకారంతో యుద్ధప్రాతిపదకన పైపులైన్ల లీకేజీ మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్, జిల్లా ఎపిడిమిక్ అధికారి వాణి, జిల్లా సబ్ యూనిట్ మలేరియా అధికారి పీరు సాహెబ్, వైద్యాధికారులు మోహన్‌వేలు పాల్గొన్నారు.

### బాలిక కిడ్నాప్‌కు యత్నం

**కుప్పంరూరల్:** మండలంలోని కృష్ణదాసనపల్లిలో బాలికను కిడ్నాప్ చేయడానికి యత్నించిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మటార్లపల్లెకు చెందిన బాలిక కృష్ణదాసనపల్లి ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం 9.30 గంటలకు గ్రామం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలకు బయలుదేరింది. మార్గమధ్యంలో పెట్రోల్‌బంకు సమీపానికి రాగానే ఇద్దరు మాస్కు ధరించిన యువకులు బాలిక వద్దకు వచ్చారు. ''రూ.20 నోటు ఇచ్చి మీ అమ్మ పిలుస్తోంది... రా'' అంటూ బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకునే ప్రయత్నం చేశారు. అయితే బాలిక కిడ్నాపర్ల చేయి కొరికేసి పరుగు తీసింది. గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. గ్రామస్తులందరూ పాఠశాల వద్దకు వచ్చి ఆరా తీశారు. ఎవరికీ కిడ్నాపర్ల ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేపడుతున్నారు. విషయం చుట్టుపక్కల గ్రామాలకు పాకడంతో చర్చనీయాంశంగా మారింది.

### ఎక్సైజ్ డీసీగా విజయశేఖర్



**చిత్తూరు అర్బన్:** ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డెప్యూటీ కమిషనర్ (డీసీ)గా టి.వి జయశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎక్సైజ్ సహాయ కమిషనర్‌గా శ్రీనివాసాచారి, చిత్తూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్)గా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు.

### నలుగురికి జైలుశిక్ష

**చిత్తూరు అర్బన్:** భూ వివాదం కేసులో నలుగురు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి గురువారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణారెడ్డి కథనం మేరకు బంగారుపాళ్యం మండలం పాన్నెపాలెం గ్రామానికి చెందిన రఘునాథ మందడికి లోకనాథంకు భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2021 అక్టోబర్‌లో ఇరు కుటుంబాల వారు గొడవపడ్డారు. రఘునాథ మందడి అతని కుమారుడు రామరాజు కలిసి తమపై దాడి చేశాడని లోకనాథం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లోకనాథం అతని కుమారుడు మాధవయ్య కలిసి తమపై దాడి చేశారని రఘునాథ మందడి ఫిర్యాదు చేయగా రెండు వర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టుకు తరలించారు. రఘునాథ మందడి, రామరాజుకు రెండేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి మూడు వేల జరిమానాతోపాటు లోకనాథం, మాధవయ్యకు ఏడాది జైలు శిక్ష ఒక్కొక్కరికి వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## జిల్లా సాంస్కృతిక పోటీల్లో నగరి ప్రతిభ



పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్

**నగరి :** చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో సెట్విన్, యువజన సర్వీసుల శాఖ వారు నిర్వహించిన జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీల్లో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. జానపదం బృంద నృత్యంలో మేఘన, విజయలక్ష్మి, విశాలాక్షి, గాయత్రి, లోకేశ్వరి, పద్మ, కల్పైరోజా ద్వితీయ బహుమతిని, జానపదం సోలో డాన్స్‌లో గాయత్రి ద్వితీయ బహుమతిని, పెయింటింగ్‌లో హేమావతి ద్వితీయ బహుమతిని, ఉపన్యాస పోటీల్లో హేమావతి, అముద, సైఫ్ అలీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకొని సెట్విన్ సీఈవో డాక్టర్ మురళీకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారని చెప్పారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ చూపిన విద్యార్థులను, విద్యార్థి బృందానికి అనుసంధాన కర్తగా వ్యవహరించిన కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.అరుణకుమారిని ప్రిన్సిపల్ అభినందించారు.

## పోటీల్లో యాదమరి విద్యార్థుల ప్రతిభ





వైశాలి, రోషిణి

**యాదమరి(పూతలపట్టు):** జిల్లా కేంద్రమైన చిత్తూరులోని పీసీఆర్ స్కూల్లో గురువారం బాలికల సంరక్షణ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీల్లో యాదమరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వైశాలి ప్రథమ బహుమతి సాధించింది. ఆమెకు అధికారులు రూ.5000 వేలు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో యాదమరి మండలం కె.గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రోషిణి జిల్లా స్థాయి రెండవ బహుమతిగా రూ.3000 వేలు సొంతం చేసుకుంది. వారిని పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

# పోస్టుమార్టం.. డాక్టర్లకు భయం

**ఇటీవల బంగారుపాళ్యం మండలం మొగిలిఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో బస్సులోని డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు ఏడుగురి వరకు సంఘటనా స్థలంలోనే చనిపోయారు. ఆ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నేరుగా చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన మరుసటి రోజు రెండు టేబుళ్లు ఏర్పాటు చేసి మధ్యాహ్నం 2 గంటల్లోపు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. ఇద్దరు డాక్టర్లు ఆ సమయంలో కచ్చితంగా పనిచేయాల్సి వచ్చింది.**

- జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయడానికి తప్పని ఇక్కట్లు
- ఇద్దరు డాక్టర్లే ఉండడంతో తీవ్ర ఒత్తిడి
- వేధిస్తున్న మహిళా డాక్టర్ల కొరత
- పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు అధిక పనిభారం
- కనీసం 8 మంది డాక్టర్లు అవసరం అంటున్న ఆస్పత్రి వర్గం
- నెలకు 40 వరకు పోస్టుమార్టం కేసులు
- గుక్క తిప్పుకోలేకపోతున్న వైద్యులు



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసర విభాగం

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, హత్యలు అనునిత్యం జరుగుతూనే ఉంటాయి. వీటిలో చాలావరకు పోలీసు కేసులవుతున్నాయి. అనుమానాస్పద మృతికి సంబంధించి, ఇక బీమా క్లెయిమ్ చేసుకోవడానికి శవాలకు పోస్టుమార్టం తప్పనిసరి. ఈ నేపథ్యంలో పోస్టుమార్టం చేయాలంటే జిల్లా ఆస్పత్రిలో ఇద్దరు డాక్టర్లే గతి అవుతున్నారు. ప్రక్రియలో మహిళా డాక్టర్లు లేకపోవడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం భారమవుతోంది. అందువల్ల 8 మంది డాక్టర్లు అవసరమంటూ ఆస్పత్రి వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. చిత్తూరు పరిసర ప్రాంతాలతో పాటు బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల, బీఎన్‌ఆర్‌పేట, జీడీనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, పాకాల, పూతలపట్టు వంటి ప్రాంతాల నుంచి పోస్టుమార్టంకు మృతదేహాలు పదుల సంఖ్యలో ఇక్కడికి వస్తున్నాయి. పలమనేరు సరిహద్దు నుంచి పాకాల సరిహద్దు వరకు ఎక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగినా మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఒక్కోసారి 5 నుంచి 10 మధ్యలో మృతదేహాలు రావడంతో డాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి నెలా 30 నుంచి 40 కేసుల వరకు పోస్టుమార్టం చేయాల్సి వస్తోందని ఆస్పత్రి వర్గాలు వాపోతున్నాయి.

**ఇక్కడ కూడా చేయవచ్చు..**

బంగారుపాళ్యం సీహెచ్‌సీలో, పి.కొత్తకోటలో పోస్టుమార్టం చేసే అవకాశాలు ఉన్నా చేయట్లేదని జిల్లా ఆస్పత్రి అధికారుల వాదన. పెనుమూరులో పోస్టుమార్టం చేసేందుకు వసతులు ఉన్నా చేయడం లేదని, అక్కడ వాడకంలోకి తెస్తే..జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిపై భారం తగ్గుతుందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇక పాకాల నుంచి కూడా మృతదేహాలను చిత్తూరు జిల్లా ఆస్పత్రికి కాకుండా, తిరుపతికి తీసుకెళ్తే కొంతవరకు ఒత్తిడి తగ్గుతుందని చెబుతున్నారు. మరోవైపు ఈ భారం తగ్గాలంటే అపోలో వైద్యులకు పోస్టుమార్టం బాధ్యతలను అప్పగించవచ్చనే వాదన కూడా నడుస్తోంది. ఈ విషయాన్ని ఆస్పత్రి అధికారులు జిల్లా అధికారులు, రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు ఏరకమైనా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

### ఇద్దరు డాక్టర్లే గతి..

ప్రస్తుతం ఆస్పత్రిలో ఇద్దరు డాక్టర్లతోనే పోస్టుమార్టం ప్రక్రియ పూర్తవుతోంది. అయితే ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ కేసులు వస్తే డాక్టర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. వరకట్నం, లాకప్ డెత్, ఆత్మహత్యలు, మహిళల హత్యలు జరిగినప్పుడు పోస్టుమార్టం చేయాల్సి వస్తే మహిళా డాక్టర్లు కచ్చితంగా ఉండాలి. కానీ జిల్లా ఆస్పత్రిలో మహిళా డాక్టర్ లేరు. ఇలాంటప్పుడు పురుష డాక్టర్లకు అవస్థలు తప్పడం లేదు.

### ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం..



పోస్టుమార్టం చేయడానికి ఇబ్బందులు ఉన్న విషయం తెలిసిందే. ఈవిషయాన్ని జిల్లా, రాష్ట్ర అధికారులకు తెలియజేశాం. అలాగే ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. వాళ్లు కూడా డాక్టర్ల కొరతపై స్పందించారు. త్వరలో సమస్యను పరిష్కరించేలా చూస్తాం.

– అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

### పాడి అభివృద్ధే లక్ష్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

**కుప్పం :** నియోజకవర్గంలో పాడిపరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందులో భాగంగా గోకులం షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పశు సంవర్ధశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి 503 గోకులం షెడ్లు మంజూరైనట్టు తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. గోకులం షెడ్లు సంబంధించి జియో ట్యాంటింగ్ చేసి ఐడీ క్రియేట్ చేసి 90 శాతం సబ్సిడీలో పనులు వేగవంతం చేయాలన్నారు. ఎస్టిమేషన్లు, బిల్లులు అప్లోడింగ్‌పై పశు సంవర్ధక శాఖ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**ఫిర్యాదుల స్వీకరణ**

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 117 అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. వాటి 95 రెవెన్యూ శాఖ పరిధిలోనివి కావడంతో వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కడా సీడీ వికాస్ మమ్మత్, ఆర్‌డీఓ శ్రీనివాస్ రాజ్, డీఎస్పీ పార్థసారథి, టీడీపీ నాయకుడు డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్లుప్తంగా

**పథకాలను వినియోగించుకోండి**



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాస్

**చిత్తూరు కలెక్టరేట్ :** బధిరుల అభివృద్ధి కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ బధిరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా అసోసియేషన్ ఆఫ్ డెఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ, అంబేడ్కర్ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఏడీ మాట్లాడుతూ బధిరుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. పింఛన్ల పంపిణీ, చెవిటి మిషన్లు, హియర్ అండ్ స్పీచ్ థెరపీ పలు పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబు, జనరల్ సెక్రటరీ విక్రమ్ కుమార్, దివ్యాంగ జేఏసీ నాయకులు మురళి, పలువురు అధికారులు సంఘ సభ్యులు, బధిరులు పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
Residential Teachers for Mathematics, P.E.T and Drivers
to work in a reputed School.
8688888802

అర్జెంటుగా కావలెను
మా రిసార్ట్‌లో పనిచేయుటకు
కిచెన్ అసిస్టెంట్స్
స్టివార్డ్స్ కావలెను
కనీసం 6 నెలలు నుండి 1 సంవత్సరకాలం అనుభవంగలవారు కావలెను.
సంప్ర: 8341102247, 83411 02246
Email: reception@lakevalleyresort.in
LAKE VALLEY RESORT & SPA
Bhakrapeta Highway (NH-71)
Tirupati (District)

జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ, చిత్తూరు జిల్లా
షార్ట్ టెండర్ ప్రకటన
చిత్తూరు జిల్లా ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరమునకు 1 వ తరగతి నుండి 10వ తరగతి వరకు పరీక్షలను నిర్వహించుటకు తెలుగు, ఇంగ్లీషు మరియు ఉర్దూ తమిళ్ మీడియంలలో ప్రశ్నాపత్రములను సబ్జెక్టు వారిగా, తరగతుల వారిగా ముద్రించి పాఠశాలల వారిగా ప్యాకింగ్ చేసి, ప్యాకింగ్ చేసిన బండిళ్లను జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్సుకు సరఫరా చేయుటకు ట్రాన్స్‌పోర్ట్ మరియు GST తో పేజీ రేట్‌తో సహా టెండర్ దాఖలు చేయుటకు ప్రకటన జారీ చేయడమైనది OMR Sheets ముద్రణ మరియు OMR Sheets జవాబు పత్రములను స్కానింగ్ చేయుటకు కూడా టెండర్లను ఆహ్వానించడమైనది. టెండర్లో పాల్గొనదలచిన వారు దరఖాస్తు ఒక్కింటికి రూ.500/- దరావతును కార్యదర్శి, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ, చిత్తూరు పేరున 30.09.2024 లోపు డి.డి. తీసి కార్యదర్శి,DCEB, చిత్తూరు వారికి సమర్పించి దరఖాస్తు ఫారాలు పొందవలెను. మరిన్ని వివరముల కొరకు కార్యదర్శి, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ, చిత్తూరు జిల్లా వారిని సంప్రదించగలరు. సెల్: 8493222662.
సం/- ఛైర్మన్, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ, చిత్తూరు జిల్లా

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■ SBI నందు కాంట్రాక్టు పద్ధతిలో పని చేయుటకు Attenders & BRE లు కావలెను. Outsourcing/Contract సెల్: 8897909097, KCS
DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate
PLOTS FOR SALE
■ తిరుపతి ... జాతీయ రహదారికి ... 87122 76826, 8978465644

Services
■ CLEANING. బాత్రూం క్లీనింగ్ & వాటర్ ట్యాంక్ క్లీనింగ్ & హౌస్ కీపింగ్ సర్వీసెస్ కోసం సంప్రదించండి. సెల్: 9000312779, తిరుపతి.

Wanted
■ Immediate joining for Banking Collections dept. required Telecallers (Freshers &Exp). Collection Executives(only DRA Certified)can apply Location: Tirupati, 7569326028/9014790147/7013700368

గమనిక

CONTACT : 9440166091, 9951602370